# మగమహారాజు

- సత్యం మందపాటి



అతను :

సౌందర్యలహరి నేల నుండి నింగిదాకా
ముగ్ధ మనోహర రూపంలో కదలాడుతుంటే
విద్యా విచక్షణా ఆమె ముఖారవిందంలో
తొణికిసలాడి అతనికి కనువిందు చేస్తుంటే
సర్వం మరచిపోయి తన్మయత్వంతో చూస్తున్నాడు
ఆమె వెచ్చని ఒడిలో తన జీవితాన్ని ఊహిస్తున్నాడు

అతని తల్లి :

ఆనాడు కట్నాల కాలువలో కొట్టుమిట్టాడి పోయి
కాలం తీరకనే కాష్టంలో కలిసిపోయిన కన్న తండ్రినీ
జడను పట్టి లాగి కోడలు సవరాల జవరాలు కాదని
సంతలో పాట పాడించి బేరం చేసిన దాహలక్ష్మినీ
మరచిపోయింది ఒకనాటి ఆ గుండెలమీద కుంపటి
ఈనాడో మగమహారాజుకి తల్లిగా పొగలు కక్కింది.

పశువు - ఇంకోటి :

బజారు వేలంలో అతి చౌకగా దొరికిన గానుగ ఎద్దు
తన యజమానికి సేవ చేస్తున్నది మితిమీరిన విశ్వాసంతో
పెళ్ళిచూపుల్లో పెద్ద ఖరీదుకి అమ్ముడుపోయిన వరుడు
తన యజమాని చేత పని చేయిస్తున్నాడు యింటా బయటా
ఎందుకు జరుగుతున్నదో ఈ తికమక వ్యవహారం
పశువులకు లేకపోవటం వల్లనేమొ ఆ చదువూ సంస్కారం !!